క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్‌: మండలంలోని ఉంతకల్లులో కొద్ది రోజులుగా ఏర్పడిన తాగునీటి సమస్య ఏపీఐఐసీ చైర్మన్, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి చొరవతో పరిష్కారమైంది. మండలంలోని ఉంతకల్లులో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును సర్పంచ్ ముక్కన్న, ఎంపీటీసీ వనజాక్షి, వైస్ సర్పంచ్ లోకేష్ ప్రారంభించారు.

నేడు ఎంపీ పర్యటన

కళ్యాణదుర్గం రూరల్‌: అనంతపురం ఎంపీ వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య గురువారం ఉదయం మున్సిపాలిటి పరిధిలోని ఉదయం 15,16 వార్డుల్లో పర్యటించనున్నారు. అనంతరం కుందిర్పిలో చేయూత కార్యక్రమం, కుందర్పితోపాటు జంబుగుంపుల, నిజవళ్ళి, బసాపురంలో ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించనున్నారు. అనంతరం కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్‌లో జరిగే చేయూత కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎంపీ కార్యాలయవర్గాలు వివరించాయి.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బసంపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శెట్టూరు: గ్రామంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బసంపల్లి గ్రామస్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక వలంటీర్లను సన్మానించారు. నాయకులు శ్యామ్ సుందర్ చౌదరి, నాగేంద్ర, తిప్పేస్వామి, లక్ష్మణమూర్తి, మంజునాథ తదతరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : ఎరడికెర, వెస్ట్ కోడిపల్లి, పొబ్బర్లపల్లి, పోలేపల్లి, గుండిగానీపల్లి, వేపులపల్లి, చెలిమేపల్లి, భైరసముద్రం, నాగిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు , ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ లు అంజినమ్మ, మమత , సుజాతమ్మ, శెట్టిగారి మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: ఎర్రగుంట, అల్లాపురంలో బుధవారం 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపీపీ నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు అంజయ్య, మంజునాథ్, కరియన్న, జయసింహ, ఉపసర్పంచ్ వన్నూరుప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్ తండా (వెంకటాంపల్లి పెద్దతండా) పరిసర ప్రాంతంలో బుధవారం భద్రంపల్లి ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



కొనకొండ్లలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో బుధవారం భోగేశ్వర వీరభద్ర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి హాజరై స్వామిని దర్శించుకున్నారు.

రూ.4,147 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి





మెగా చెక్కు అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, హాజరైన మహిళలు

- వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య, పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ

శెట్టూరు: కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్న రూ.4147 కోట్లు వెచ్చించారని వైఎస్సార్‌పీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం వైఎస్సార్ చేయూత కింద 2,830 లబ్ధిదారులకు రూ.5.3 కోట్ల మెగా చెక్కును పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణతో కలిసి మహిళలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో బీటీపీ కాలువ పనులు చేసింది బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబేనన్నారు. 2019 ఎన్నికల్లో టికెట్ రాలేదన్న కారణంతో దుర్గం నుంచి వెళ్లిపోయిన వ్యక్తి, 10 ఏళ్లగా బీటీపీ కాలువ పనులు చేయలేని వ్యక్తి ఇప్పుడు ఎలా చేస్తాడని ప్రశ్నించారు. ఓటుకు ఐదు వేలు ఇస్తానని చెప్పుకుంటున్నారని, తాము నియోజకవర్గానికి రూ.4,147 కోట్లు నేరుగా ప్రజల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇందులో కనీసం సగం డబ్బు ప్రజలకు ఇవ్వమనండి అంటూ ఘాటుగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరిచ్చే బాధ్యత తీసుకుంటామని ఎంపీ పేర్కొన్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం..

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా సమయంలో కూడా ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా కాలెండర్ ప్రకారం పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. వైకేపీ ఏసీ రాధారాణి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఎం సర్దానప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జెడ్పీటీసీ మంజునాథ్, ఎంపీపీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ శివన్న యాదవ్, జేసీఎస్ కన్వీనర్ తిమ్మరాజు, మాజీ మండల కన్వీనర్ సోమనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీలు చెవుల కిష్టప్ప, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'అండగా ఉంటాం ఆశీర్వదించండి'

కళ్యాణదుర్గం: ప్రజలకు వైఎస్సార్‌సీపీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఆశీర్వదించాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య కోరారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని 14,15,16 వార్డులలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ చేసిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

శెట్టూరు: ఐదుకల్లు గ్రామంలో ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీ తలారి రంగయ్య భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



కొనకొండ్లలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి
- కొనకొండ్లలో రూ.7.06 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్యకేంద్రం ప్రారంభం

వజ్రకరూరు: సీఎం వైఎస్ జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి కొనియాడారు. బుధవారం మండలంలోని కొనకొండ్లలో రూ.7.06 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (30 పడకల ఆసుపత్రి) ప్రారంభించారు. శిలఫలకాన్ని ఆవిష్కరించి, ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన వివిధ విభాగాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సీఎం జగన్ రూ.వేల కోట్ల నిధులు కేటాయించి ఆసుపత్రుల రూపురేఖలు మార్చినట్లు వెల్లడించారు. పేదవాడి ముంగిటకే ప్రభుత్వ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం మా తండ్రి, మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి కేటాయించిన స్థలంలోనే 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. డీడీహెచ్ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్ మాట్లాడుతూ.. కొనకొండ్లలో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం 30 మంది దాకా వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. త్వరలోనే స్పెషలిస్టులు, ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించడం జరుగుతుందని వెల్లడించారు. నూతన ఆసుపత్రిలో శస్త్రచికిత్సలతో పాటు మెటర్నిటీ, ఇతర వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నంచరల ఇందిరమ్మ, డ్రాయింగ్ ఆఫీసర్ గంగాధర్, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణాయాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మెహబూబ్, డీఈ శ్రీనివాసులు నాయుడు, సర్పంచులు జయేంద్రరెడ్డి, తిరుపాల్ యాదవ్, రామాంజనేయులు, మూరిన్ని ధనలక్ష్మి, మాజీ ఎంపీపీ తిప్పయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జయచంద్రా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహా సంగ్రామానికి సిద్ధంకండి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మెట్టు గోవిందరెడ్డి



రాయదుర్గం వినాయక సర్కిల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనలో మెట్టు గోవిందరెడ్డి, నాయకులు

రాయదుర్గం: మరో రెండు, మూడు రోజుల్లోనే మహా సంగ్రామం మొదలు కాబోతోంది. ప్రతి ఒక్కరూ పోరుకు సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం డీ హీరేహాళ్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని పార్టీ శ్రేణులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అలాగే టీడీపీ కుట్రలు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం వన్నూర్ స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, మురడి మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ తొండె వెంకటేశులు, అంజిరెడ్డి, సింగాడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

రాయదుర్గం: రాయదుర్గం మండలం జుంజురంపల్లికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన నరేష్, సురేష్, బి అనిల్, రాజేష్, గోవిందప్ప, మహమ్మద్, తిప్పేష్, కే గోవిందు, ఆర్ రామాంజి, మల్లి, హెచ్ వన్నూరుస్వామి, పి మల్లప్ప, రాజేష్, ఏలియా, మహేంద్ర, రవి, అంజి, రాజు, నగేష్, గొల్ల తిప్పేస్వామి తదితరులు ఉన్నారు. వారందరికీ పార్టీ కండువు కప్పి మెట్టు గోవిందరెడ్డి సాదరంగా ఆహ్వానం పలికారు.

టీడీపీ సైకోల పైశాచికానికే గీతాంజలి బలి

రాయదుర్గం: టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైకోల కారణంగా గీతాంజలి మృతి చెందిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గీతాంజలి మృతికి సంతాపంగా బుధవారం రాత్రి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో కలసి స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం నుండి వినాయక సర్కిల్ వరకు కాగడాలు, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పాటై సైకో మూకలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కణేకల్లు పీఏసీఎస్ జిల్లాలో నంబర్‌వన్

- పెట్రోల్ బంకు ప్రారంభంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత



పెట్రోల్ బంకు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, జిల్లా అధికారులు

కణేకల్లు: 'కణేకల్లు పీఏసీఎస్ అంటేనే ఓ స్పెషల్ మార్క్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 108 పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) ఉంటే అన్నీ సొసైటీలకు భిన్నంగా ఇది ఉంటుంది. ఏ వ్యాపారం చేసినా లాభాలను సాధిస్తోంది' అని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత పేర్కొన్నారు. కణేకల్లులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఏడీసీసీ జీఎం సురేఖరాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరితో కలిసి చైర్‌పర్సన్ లిఖిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లిఖిత మాట్లాడారు. 108 సొసైటీల్లో బాగా లాభాలు ఆర్జిస్తూ కణేకల్లు సొసైటీ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కణేకల్లు సొసైటీ అభివృద్ధికి సభ్యులు, ప్రజలు తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ సభ్యురాలు డీ.పద్మావతి, మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, ఏడీసీసీ డీపీడీఎం తేజశ్విని, చీఫ్ మేనేజర్ డీకే దుర్గాప్రసాద్‌రావు, డీఎల్‌సీఎం ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌డీఎల్‌సీఓ చంద్రమోహన్, డీసీఓ అరుణకుమారి, ఆదర్శభారతి రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు కందుకూరి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయమని కోరుతున్న విశ్వనాథ్‌రెడ్డి

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్ రెడ్డి జోరుగా ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయని విజ్ఞప్తి చేశారు. అలాగే పొలాలు, ఆరు బయట మిర్చిను ఎండబెట్టి గ్రేడింగ్ చేస్తున్న కూలీల వద్దకెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ సీఎం చేయాలని కోరారు.

రూ.8 లక్షలతో ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ఓబుళమ్మ

కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లిలో శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.8 లక్షల నిధులు మంజూరైనట్లు సర్పంచ్ ఓబుళమ్మ తెలిపారు. బుధవారం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో పశుగ్రాసం దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

బొమ్మనహాళ్‌: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు పడి పశుగ్రాసం దగ్ధమైంది. ఎస్సీ కాలనీ శివారులో కంప్లి వంద్రప్ప 32 ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకున్న గడ్డి మొత్తం కాలిపోయింది. రూ.1.50 లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం, రంగసముద్రం, పూలకుంట, గుమ్మఘట్ట, సిరిగెదొడ్డి గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ గౌరిదేవి తెలిపారు.

రైతులను మోసం చేస్తే చర్యలు

రాయదుర్గం: వ్యాపారులు రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని మార్కెట్ యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, వైస్ చైర్మన్ మేకల శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం చింతపండు వేలం మార్కెట్‌ను వారు కార్యదర్శి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ యాలేటి రమేష్‌లతో కలసి పరిశీలించారు.

నేడు వైఎస్సార్ చేయూత సంబరాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

మహిళల ర్యాలీ



బెళుగుప్పలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

బెళుగుప్ప: మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఏఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు బ్రమేష్, శంకర్‌నాయక్ కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలోని ఎర్రితాత స్వామి ఆలయ ప్రాంగణంలో ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు తొలుత ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బ్రహ్మసముద్రం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ పౌష్టికాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు ,కిశోర బాలికలకు వివరించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బ్రహ్మసముద్రం: స్థానిక భైరవానితిప్ప సొసైటీలోని సభ్యులు, రైతులు , క్రాప్, ఎల్‌టీ, కమర్షియల్ రుణాలు తీసుకున్న వారు ఈనెల 31లోపు రెన్యూవల్ చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజినేయులు కోరారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెన్యూవల్ చేసుకున్న ప్రతి రైతుకు 3 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బ్రహ్మసముద్రం : గుండిగానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు పోలేపల్లి సర్పంచ్ శెట్టిగారి మంజునాథ బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

గుడిసె దగ్ధం

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో రైతు వలిసాబ్ పొలంలో బుధవారం గుడిసె దగ్ధమైంది. పొలంలో డ్రిప్ వైర్లు, స్ప్రేయర్‌లతో పాటు ఇతరాత్రా వ్యవసాయ పరికరాలు నిల్వ ఉంచేందుకు ఏర్పాటు చేసుకొన్న గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధిత రైతు తెలిపారు. డ్రిప్ సామగ్రి, 10 బస్తాల ఎండు మిర్చి, ఇతర వ్యవసాయ పనిముట్లు కాలిబూడిదయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

విశ్వేశ్వరరెడ్డిని ఓడించే దమ్ముందా?





ఉరవకొండ: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పయ్యావులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉరవకొండ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డిని ఓడించే దమ్ముందా అని సీపీఎం నాయకులకు వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కేశవ్ ప్రోద్బలంతో 2004కు చెందిన కమ్యూనిస్టులు సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డిని ఓడిస్తామని సీపీఎం నాయకులు ప్రకటించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కమ్యూనిస్టు నేత అశోక్‌కుమార్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి కళ్యాణ మండపంలో టీడీపీ నాయకులు ఇచ్చిన డబ్బుతో సీపీఎం నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించి కేశవ్ సూచనలతో విశ్వేశ్వరరెడ్డిని ఓడిస్తామని చెబుతారా అని మండిపడ్డారు. డబ్బు కోసం కమ్యూనిస్టు విలువలను తుంగలో తొక్కి నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వసంతమ్మ, మల్లికేసు, వీరన్న పాల్గొన్నారు.

పయ్యావులను ప్రజలు నమ్మరు..

ఉరవకొండ: పయ్యావుల కేశవ్ చీరలు, మద్యమే కాదు ఇంటింటికీ వెళ్లి బంగారం ఇచ్చినా.. అతడ్ని నమ్మే పరిస్థితిలో లేరని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు ఏసీ ఎర్రిస్వామి, సుంకన్న, మండల సమన్వయకర్త ఓబన్న, పార్టీ రాష్ట్ర నాయకులు తేజోనాథ్, అశోక్, బసవరాజు, మాజీ ఎంపీపీ చందాచంద్రమ్మ మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఎమ్మెల్యే కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు నియోజకవర్గంలో ప్రలోభాలకు తెరలేపారన్నారు. ప్రజల బాధలను ఎప్పుడూ పట్టించుకోని కేశవ్‌ను ప్రజలు ఏ విధంగా నమ్ముతారని ప్రశ్నించారు.